క్లుప్తంగా

ద్విచక్ర వాహనం దగ్ధం



మంటల్లో కాలుతున్న ద్విచక్ర వాహనం

ఆరిలోవ: రహదారిపై ప్రయాణిస్తుండగా ఓ ద్విచక్ర వాహనం దగ్ధమైంది. బీఆర్‌టీఎస్ రోడ్డులో ముడసర్లోవ వద్ద జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఆరిలోవ ప్రాంతం నుంచి ఇద్దరు వ్యక్తులు హోండా యాక్టివ్‌పై పైనాపిల్ కాలనీ వెళ్తున్నారు. ముడసర్లోవ రిజర్వాయరు దాటి విశాఖ కేంద్ర కారాగారం సమీపానికి వెళ్లేసరికి బైక్ వెనక భాగంలో చిన్నగా మంటలు వచ్చాయి. వారి వెనక ప్రయాణించేవారు మంటలు గమనించి వాహనచోదకుడికి చెప్పారు. వెంటనే వారు రామకృష్ణా పురం ఎదురుగా వాహనం నిలిపి దూరంగా పారిపోయారు. సుమారు 10 నిమిషాలలో ఆ వాహనం నుంచి పెద్దగా మంటలు చెలరేగి పూర్తిగా కాలి పోయింది. వాహనంలో ఎలక్ట్రికల్ వైర్లు కలిసిపోయి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాప్తించి ఉంటాయని పలువురు భావిస్తున్నారు. బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరూ దూరంగా పారిపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

గాజువాక పరస పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక : ఫిబ్రవరి 2న నిర్వహించనున్న శ్రీ సీతారామ ఉమా రామలింగేశ్వరస్వామి పరస (గాజువాక పరస) పోస్టర్‌ను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉత్సవ కమిటీ సభ్యులకు పరస నిర్వహణపై వివిధ సూచనలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని గాజువాక పరసను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాన్ని రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్నామన్నారు. గత రెండేళ్లుగా మిగిలిన నిధులు, పరస నిర్వాహక కమిటీ సభ్యుల సొంత నిధులతో కార్యక్రమాన్ని జరపనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్, కార్పొరేటర్లు మహ్మద్ ఇమ్రాన్, నర్సింహ పాత్రుడు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. ఉదయం 9.30 గంటల నుంచి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈసేవ నిర్వహించారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై అధిష్టంపజేసి అష్టోత్తరశతనామావళి పూజ చేసి హారతులు అందజేశారు.

రేపు గ్రహణ మొర్రి, గ్రహణశూల బాధితులకు స్క్రీనింగ్ క్యాంపు

సింహాచలం: పెందుర్తి భవిత కేంద్రంలో గురువారం గ్రహణం మొర్రి, గ్రహణశూల విద్యార్థులకు స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు విశాఖ జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త ఎ .అబ్దుల్లా ఆశ మంగళవారం తెలిపారు. ప్రభుత్వ సమగ్రశిక్ష , బసవతారకం స్మైల్ ట్రెన్స్ సెంటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్టు పేర్కొన్నా రు. ఆరోజు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5గంటల వరకు క్యాంపు నిర్వహించ డం జరుగుతుందన్నారు. అవసరమైనవారికి హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు.

గౌరీనగర్‌కు పండగొచ్చింది

- టిడ్కో ఇళ్లు ప్రారంభించిన ఆడారి ఆనంద్ కుమార్
- ఫ్యాన్లు, ప్రొసీడింగ్స్ అందించిన జియ్యాని శ్రీధర్



టిడ్కో ఇళ్లను ప్రారంభిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్, జియ్యాని శ్రీధర్, అధికారులు



లబ్ధిదారులకు ఫ్యాన్లు అందిస్తున్న జియ్యాని శ్రీధర్, విజయ్, మారుతి

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు గౌరీనగర్ రిక్షా కాలనీ వాసులకు జనవరి నెలాఖరున మళ్లీ పండగొచ్చింది. ఇక్కడి టిడ్కో ఇళ్లను పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆధ్వర్యంలో 48 మంది లబ్ధిదారులకు ఆయన ఇళ్లను అందించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఏళ్ల కిందట ఇళ్ల నిర్మాణం పూర్తయినా లబ్ధిదారులకు ఇవ్వలేని పరిస్థితిలో ఉండి పోయాయని తెలిపారు. అయితే పట్టు వదలని విక్రమార్కుడిగా శ్రీధర్ అడ్డంకులు తొలగించేందుకు ప్రయత్నాలు సాగించారని తెలిపారు. ఈ ఇళ్లు ప్రారంభించేందుకు రైల్వే అధికారులు అభ్యంతరాలు పెడుతుండడంతో జాప్యం జరిగిందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇళ్లు అందివ్వాలన్న లక్ష్యంతో టిడ్కో ఇళ్లను పూర్తి చేసి అందిస్తున్నారని తెలిపారు. అలాగే ఇంటి స్థలాలను ఇస్తున్నారని పేర్కొన్నారు. చిరకాలంగా ఉన్న రిక్షా కాలనీ వారి కల నెరవేరిందన్నారు. ఈ ఇళ్లను లబ్ధిదారులు పరిశుభ్రంగా ఉంకోవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు సీలింగ్ ఫ్యాన్లు అందించారు. ఆడారి ఆనంద్ కుమార్‌తో పాటు అధికారులకు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, జోన్–5 కమిషనర్ కృష్ణారావు, యూసీడీ పీడీ పాపు నాయుడు, టిడ్కో హౌసింగ్ డీఈ ఉమామహేశ్వరి, సీవో సుధాకర్, నాయకులు జియ్యాని మారుతి, జియ్యాని విజయ్, ఆళ్ల పైడిరాజు, అప్పలస్వామి, ఆర్‌పీలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై అవగాహన ర్యాలీ



అవహగాన ర్యాలీలో పాల్గొన్న టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఐవీ రమణమూర్తి తదితరులు

కంచరపాలెం: జోన్–5 పరిధి కంచరపాలెం కూడలిలో జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ నేతృత్వంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది మంగళవారం ఫుట్‌పాత్ ఆక్రమణలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జోన్–5 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఐవీ రమణమూర్తి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్ పరిధిలో ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురి కావడంతో పాదచారులు ఇబ్బంది పడడం, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. ప్రమాదాలకు కూడా ఫుట్‌పాత్ ఆక్రమణలు కారణమవుతున్నాయని అన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించినా, వాహనాలు నిలిపినా, వ్యాపారాలు చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్రమణలపై సచివాలయ సిబ్బంది పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెన నుంచి ఊర్వశి కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, టీపీవో ఎం.శ్రీలక్ష్మి, గుమ్మిడి శ్రీను, జీవీఎంసీ, సచివాలయ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్ అందజేత



చెక్కు అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్ కాలనీలోని పాతశివాలయం పంతులు శ్రీను మనవరాలు గొలపూడి సోనియా(4)కు మంగళవారం సీఎం సహాయ నిధి చెక్కును వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు సమక్షంలో పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ అందజేశారు. గతేడాది తీవ్ర అనారోగ్యం కారణంగా శస్త్ర చికిత్స చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న గొలపూడి సోనియా కుటుంబసభ్యులు వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావును కలిసి పరిస్థితిని వివరించారు. దీంతో ఆడారి ఆనంద్‌కుమార్ చొరవతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయగా, ప్రభుత్వం నుంచి రూ. 30 వేలు మంజూరయ్యాయి. దీంతో మంగళవారం సీఎం సహాయనిధి చెక్కును లబ్ధిదారులకు అందజేశారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆనంద్‌కుమార్ తదితరులు

మల్కాపురం : పలువురు చేతివృత్తిదారులను జగనన్న చేదోడు పథకం ద్వారా మూడేళ్ల నుండి ఆదుకుంటూ వారి కుటుంబాల్లో వెలుగులు నింపిన మనసున్న నేత మన ప్రియతమ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. చేదోడు పథకం ద్వారా పారిశ్రామిక ప్రాంత నాయీ బ్రాహ్మణులను గత మూడేళ్ల నుండి ఆదుకుంటున్నందుకు కృతజ్ఞతగా సీఎం జగన్ చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. 60వ వార్డు పరిధి గుల్లలపాలెం వద్ద నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై క్షీరాభిషేకం చేశారు. వత్తి పనులు చేసుకుని జీవినం సాగిస్తున్న వారికి సీఎం జగన్ తన పాదయాత్రలో ఏదైతే హామీ ఇచ్చారో ఆ హామీని గత మూడేళ్ల నుండి జగనన్న చేదోడు పథకం ద్వారా అమలు చేస్తున్నారని అన్నారు. జగన్ అంటే ఓ నమ్మకం.. భరోసా అన్నారు. కొంత మంది నాయకుల మాదిరి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కే నైజం జగన్‌మోహన్‌రెడ్డిది కాదన్నారు. వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు పీవీ సురేష్ మాట్లాడుతూ కులవృత్తి చేసుకునే వారినే కాక రాష్ట్రంలో ప్రతి నిరుపేద గుండెలోనూ జగనన్న నిలిచిపోతారన్నారు. ఆయన వారికి అందించిన సేవలు నేడు ఆయన కీర్తికి కారణమన్నారు. ఈ కార్యక్రమంలో పలు వార్డుల కార్పొరేటర్లు కొణతాల సుధ, గుండపు నాగేశ్వరరావుతో పాటు నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు ధర్మశాస్త్ర విగ్రహ ప్రతిష్ట



అయ్యప్పస్వామి దేవాలయం

సింహాచలం: సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం పూర్ణ పుష్కల సమేత శ్రీహరిపుత్రుడు(ధర్మశాస్త) విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్టు అయ్యప్ప సేవా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులంతా పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని కోరారు.

24/7 నాణ్యమైన విద్యుత్

- పనుల పురోగతిలో ఏపీఈపీడీసీఎల్ ముందంజ
- జోన్–2 పరిధిలో సబ్ స్టేషన్ల అభివృద్ధికి నిధులు మంజూరు
- 4 సబ్ డివిజన్లలో 13 సెక్షన్లలో రూ.4.19 కోట్లతో పనులు
- పరిశ్రమలు, గృహ వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు



తుప్పు పట్టిన స్తంభాన్ని తొలగించి, కొత్తది వేస్తున్న సిబ్బంది



కేవీ లైన్ల స్తంభాల తీగలను మార్చుతున్న విద్యుత్ సిబ్బంది

కంచరపాలెం: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) చర్యలు చేపట్టింది. కంచరపాలెం జోన్–2 డివిజన్ పరిధిలో నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు పనులు చేపట్టింది. ఇటీవల రాష్ట్రంలో జరిగిన విద్యుత్ తీగల ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించిన నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన సుమారు రూ.4.19 కోట్లు నిధులతో ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు ఆదేశాలతో కంచరపాలెం జోన్–2 డివిజన్‌లోని 4 సబ్‌డివిజన్ (కంచరపాలెం, ఆటోనగర్, మల్కా పురం, గాజువాక) లకు చెందిన 13 అసిస్టెంట్ ఇంజినీర్ కార్యాలయ ప్రాంతాల్లో పనులు చకచకా జరుగుతున్నాయి. పరిశ్రమలు, గృహ వినియోగదారులకు 24/7 నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు జోన్–2 అధికారులు కృషి చేస్తున్నారు. ప్రస్తుత విద్యుత్ సరఫరా, పంపిణీ సామర్థ్యం, భవిష్యత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు జోన్–2 పరిధిలోని సబ్ స్టేషన్ల మరమ్మతు పనులు చేపట్టినట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కోటేశ్వర నాయుడు తెలిపారు.

మూడు నెలలుగా చకచకా పనులు

జోన్–2 డివిజన్ పరిధిలోని 13 సెక్షన్ల పరిధిలో విద్యుత్ పనులు చకచకా జరుగుతున్నాయి. పాడైన 33 కేవీ, 11 కేవీ మరియు ఎల్‌టీ విద్యుత్ ఇనుప స్తంభాలు, పాత వైర్లను మార్పు చేస్తున్నారు. రోడ్ క్రాసింగ్ వద్ద స్తంభాల ఎత్తు పెంచడం, ప్రమాదకరంగా వేలాడే విద్యుత్ వైర్లను సరిచేయడం,ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్యూజ్ బాక్సులను మార్చడం, విద్యుత్ లైన్లకు అతిదగ్గరగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, సబ్‌స్టేషన్ మరమ్మతులు జరుగుతున్నాయి. జనవరి 31నాటికి పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా మూడు నెలలుగా అధికారులు పనులు చేపట్టారు.

జోన్–2 లోని 4 సబ్ డివిజన్లలో 13 సెక్షన్లలో పనులకు మంజూరైన నిధులు

సబ్ డివిజన్ కార్యాలయం	నిధులు
ఆటోనగర్	రూ.48.12 లక్షలు
చినగంట్యాడ	రూ.23.08 లక్షలు
గాజువాక	రూ.30.05 లక్షలు
కంచరపాలెం	రూ.25.84 లక్షలు
మల్కాపురం	రూ.28.00 లక్షలు
మర్రిపాలెం	రూ.37.47 లక్షలు
మింది	రూ.36.93 లక్షలు
మురళీనగర్	రూ.44.10 లక్షలు
ఎస్ఎస్‌టీఎల్	రూ.34.58 లక్షలు
పెదగంట్యాడ(రూరల్)	రూ.13.65 లక్షలు
పెదగంట్యాడ(అర్బన్)	రూ.17.70 లక్షలు
శ్రీహరిపురం	రూ.39.13 లక్షలు
వడ్లపూడి	రూ.40.39 లక్షలు
మొత్తం	**రూ.4.19 కోట్లు**

విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చర్యలు



విద్యుత్ ప్రమాదాలను నివారించడం, విద్యుత్ సరఫరాలో అంతరాయం తగ్గి వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.4.19 కోట్లు మంజూరు చేసింది. జోన్–2 డివిజన్‌లోని 13 సెక్షన్లలో అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రజలు కూడా విద్యుత్‌ను పొదుపుగా వినియోగిస్తూ, సహకరించాలి.

– బి.కోటేశ్వరనాయుడు, జోన్–2 ఈఈ, ఏపీఈపీడీసీఎల్

గవర్నర్‌కు స్వాగతం



విశాఖ విమానాశ్రయంలో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌కు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ సీహెచ్ శ్రీకాంత్

గోపాలపట్నం: ఒక్క రోజు పర్యటనలో భాగంగా మంగళవారం విశాఖ వచ్చిన గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌కు అధికారులు ఘన స్వాగతం పలికారు. ఉదయం 10.40 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన.. బీచ్‌రోడ్‌లోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వీసీల సదుస్సుకు హాజరయ్యారు. అక్కడ కార్యక్రమం ముగించుకుని తిరిగి సాయంత్రం 4.15 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్నారు . 4.30 గంటలకు ఇక్కడ నుంచి విమానంలో విజయవాడ బయలుదేరారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, డీసీపీ ఆనందరెడ్డి, భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి తదితరులు స్వాగతం, వీడ్కోలు పలికారు.

గిట్టని వారి మాటలు నమ్మకండి

- రాష్ట్రం అభివృద్ధిపథం వైపు పయనిస్తోంది
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్



పిలకవానిపాలెం వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆనంద్‌కుమార్

మల్కాపురం : అభివద్ధి వైపు ఏపీ అడుగులు వేస్తుంటే కొంత మంది రాష్ట్రానికి ఏదో జరిగిపోయిందని తప్పుడు ప్రకటనలు చేయటం, ప్రజలను తప్పుదుదారి పట్టించడం ఎంత వరకు న్యాయమని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. 58వ వార్డు పరిధి ములగాడ గ్రామంలో రూ. 88 లక్షలతో చేపట్టిన అభివద్ధి పనులకు, గుల్లలపాలెం గ్రామంలో రూ. కోటి రూపాయలతో చేపట్టిన అభివద్ధి పనులకు, ఉప్పరకాలనీలో రూ. 16 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, ములగాడ, పిలకవానిపాలెం గ్రామాల్లో సుమారు రూ. 19 లక్షలతో జరిగిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవాన్ని, పిలకవానిపాలెంలో రూ. 25 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పిలకవానిపాలెం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. నవరత్నాల ద్వారా ప్రజలను ఆదుకుంటూ ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదలకు ఇచ్చిన హామీల ప్రకారం పథకాలను కొనసాగిస్తూనే ఉన్నారని వివరించారు. వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కృష్ణ, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి, గొందేశి వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం



ఆలయ ప్రాంగణంలో పూజలు చేస్తున్న అర్చకులు



ప్రతిష్టాపనకు సిద్ధం చేసిన ధ్వజస్తంభం

- ఎన్ఏడీ శివాలయ ప్రాంగణంలో విశేష పూజలు

గోపాలపట్నం: ఎన్ఏడీ పరిసర ప్రాంతాల్లో తొలి శివాలయమైన ప్రథమ ఉమా విశ్వేశ్వర కుమార స్వామి దేవాలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్టాపన పూజలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం 8.38గంటలకు ధ్వజస్తంభం ప్రతిష్ట చేయనున్నారు.

ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా యాగశాల నిర్మించారు. మంగళవారం ఉదయం నుంచి ప్రధాన అర్చకుడు ఆకెళ్ల సూర్యప్రకాష్ శర్మ, ఉప ప్రధాన అర్చకుడు ఆకెళ్ల రామ్మూర్తి శర్మ పర్యవేక్షణలో విశేష పూజలు, గణపతి పూజ, పుణ్యాహవచనం, దీక్షా ధారణ, యాగశాల ప్రవేశం , రుత్విక్‌ధ్వరణ, వాస్తు పూజ, హోమాలు నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు, ఆలయ పాలక మండలి చైర్మన్ గొంతిన రామకృష్ణ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో పూజలు నిర్వస్తున్నారు. ప్రతిష్టాపనకు ధ్వజ స్తంభాన్ని అలంకరించి సిద్ధం చేశారు. ఫిబ్రవరి 16న ఇత్తడి తాపడం కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ రామకృష్ణ తెలిపారు.

ఘనంగా అమ్మవార్ల తిరునాళ్లు



తిరునాళ్లకు హాజరైన ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి, ఆనంద్‌కుమార్, మాజీ మంత్రి కొణతాల

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు జవహర్‌నగర్ రోడ్డులోని కుంచుమాంబ,దుర్గమాంబ అమ్మవార్ల పరస (తిరునాళ్లు) మంగళవారం ఘనంగా జరిగింది. రెండు గుడుల వద్ద కొలువుదీరిన కుంచుమాంబ,దుర్గమాంబ అమ్మవార్లకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు పారిశ్రామిక ప్రాంత నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి, పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త,విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్,వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ తదితరులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. అలాగే ఎమ్మెల్యే పి.గణబాబు,టీడీపీ నాయకులు పోతబత్తుల శ్రీను పూజలు చేశారు.

సరికొత్త చరిత్రకు నాంది ఉక్కు ఉద్యమం

- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు



దీక్షలో మాట్లాడుతున్న వరసాల శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం: దేశంలో సరికొత్త చరిత్రకు విశాఖ ఉక్కు ఉద్యమం నాంది పలకనుందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మిక వర్గం తప్పక విజయం సాధిస్తుందన్నారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 719వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఈఎస్ఎఫ్, ఈఆర్‌సీ, సేఫ్టీ, టెక్ సెల్ తదితర విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, జె.రామకృష్ణ, డి.శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మేస్తానని పదే పదే ప్రకటనలు చేయడం సరికాదన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని దేశ ప్రజలు, కార్మికవర్గం, మరీ ముఖ్యంగా సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు గట్టి పట్టుదలతో ఉన్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా ఉక్కు ప్రజాగర్జనను విజయవంతం చేసిన ఉక్కు కార్మికులు, నిర్వాసితులకు, అఖిలపక్ష రాజకీయ పార్టీ నాయకులు, మేధావులు, స్థానికులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

డ్రాపవుట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



వివరాలు తెలుసుకుంటున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: డ్రాపవుట్ల నివారణకు ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. డ్రాపవుట్ సర్వేలో భాగంగా బడికి రాకుండా ఇళ్ల వద్దనే ఉంటున్నట్లుగా గుర్తించిన వారి వివరాలను తెలుసుకునేందుకు మంగళవారం రాత్రి ఆమె నగరంలోని న్యూకాలనీ, ధర్మనగర్ ఏరియాల్లో పర్యటించారు. సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు, సీఆర్పీలు, సచివాలయ సిబ్బందిని వెంట తీసుకొని డ్రాపవుట్స్ పిల్లల ఇళ్లకు నేరుగా వెళ్లారు. వారి తల్లిదండ్రులు, సంరక్షకులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని వారికి వివరించారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక వంటి పథకాలు అందుతాయన్నారు. బడి ఈడు పిల్లలను ఇళ్ల వద్ద ఉంచుకునేందుకు వీల్లేదని, బడికి పంపించాల్సిందేనన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆమె వెంట ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా కో–ఆర్డినేటర్ వానపల్లి శైలజ, తదితరులు పాల్గొన్నారు.